# డ్రాకులా



చలికి రక్తం గడ్డకట్టుకు పోతోంది.

ఇంటికి చేరుకోవాలన్న ఆతృతతో వడివడిగా నడుస్తున్నాను.

రోడ్డుమీద నరసంచారం లేదు.

ఉండీ ఉడిగీ కుక్కలు వికృతంగా అరుస్తున్నాయి.

మరో అరమైలు నడవాలి.

వీధి దీపం నీరసంగా వెలుగుతోంది.

వాచీ చూసుకున్నాను. ముళ్ళు కనిపించడంలేదు. గుండె గతుక్కుమంది.

ఆకస్మాత్తుగా దీపాలు ఆరిపోయాయి.

చిమ్మచీకటి.... రోమాలు నిలబడ్డాయి.

అలవాటైన త్రోవైనా ఎందుకో భయం వేస్తోంది. నడక వేగం హెచ్చించాను.

నా భయానికి కారణముంది - ఈ దేశంలో డ్రాకులాలు వీరవిహారం చేస్తున్నాయి. మనిషి వెచ్చని రక్తం కోసం ఉవ్విళ్ళూరుతూ కోరలు దువ్వుకుంటున్నాయి. పెదాలు చప్పరిస్తున్నాయి.

ఒకసారి డ్రాకులా వాతబడితే జీవితాంతం డ్రాకులాగానే గడపాలి. వాటిలాగే రక్త దాహంతో అలమటించాలి.

అమ్మయ్య - దగ్గరకి వచ్చేశాను.

మరో ఫర్లాంగు దూరం మాత్రమే — ఈ మలుపు తిరిగితే ఇంటికిపోయి నిశ్చింతగా నిద్రపోవచ్చు.

మలుపుదగ్గర మసగ్గా ఎవరిదో ఆకారం!

గుండె ఝల్లుమంది - డ్రాకులా కాదుగదా! మొండి ధైర్యంతో అడుగు ముందుకేశాను. ఆ ఆకారం నావైపే నడచి వస్తోంది.

"ఎవరూ-సుధాకరమేనా?" మాటలు ముద్దగా వినవస్తున్నాయి అటునుండి.

"ఎ....ఎవరూ" నా గొంతు నీర్సంగా పలికింది.

"అదేమిటలా భయపడుతున్నారు? నేనండీ-రాజారావుని...."

అమ్మయ్య—వృత్తగా భయపడ్డాను.

రాజారావు నా కాబోయే బావ.

నా వొక్కగానొక్క ముద్దుల చెల్లెలు సుశీల మెడలో మరో పదిహేను రోజుల్లో మూడు ముళ్లు వెయ్యబోతున్నాడు.

నిశ్చింతగా ఊపిరి పీల్చుకున్నాను.

నా చేతిని తనచేతిలోకి తీసుకున్నాడు రాజారావు.

ఇదేమిటి- ఈ స్పర్శ వింతగా ఉంది!

ఒక్కసారిగా దీపాలు వెలిగేయి.

రాజారావు మొహంలోకి చూస్తునే నా కళ్లు తిరిగేయి.

పరమ వికృతంగా ఉంది. కోరలు పొడుచుకొచ్చాయి.

పెదాలు శబ్దంచేస్తూ చప్పరిస్తున్నాడు.

విడిపించుకుందామన్నా సాధ్యం కావడంలేదు. తన కోరలతో నా మెడ మీద ముద్దు పెట్టుకుంటున్నాడు.

చైతన్య రహితంగా ఉండిపోయాను.

నా రక్తం రాజారావు గొంతులోకి జారుతోంది వెచ్చగా.

నా శరీరంలో తెలియని మార్పు వచ్చేస్తోంది.

రాజారావు నన్ను విడిచి వెళ్ళిపోయాడు దూరంగా.

## మినీ కథావీధి

మళ్ళీ దీపాలారిపోయాయి.

అయినా - నాకు భయంగా లేదు.

దాహం - విపరీతమైన దాహం వేస్తోంది.

రక్తం త్రాగాలి - ఎవరిదైనాసరే!

ఇంటికి వెళ్ళాలనిపించలేదు.

ఎక్కడికో వెళ్ళాలి- ఎవరినో వేటాడాలి.

తక్కన సుజాత గుర్తుకొచ్చింది.

సుజాత, నేనూ ఒకే ఆఫీసులో పని చేస్తున్నాం.

ఇద్దరికీ ఏ శుభ ముహూర్తానో కలిసిన పరిచయం ప్రేమగా వృద్ధి పొందడానికి ఎక్కువ కాలం పట్టలేదు.

సుశీలని మరో ఇంటి కోడలిగా పంపించేకా సుజాతని నా ఇంటి దీపంగా తెచ్చుకోవాలని నిశ్చయించుకున్నాను ఇంతకుముందే. సుజాత నుండి ఏ అభ్యంతరమూ లేదు.

మరో విశేషం మా పెళ్ళికి మంత్రాలు లేవు, కట్నాల ప్రసక్తి లేనేలేదు.

* * *

గొంతెండి పోతోంది విపరీతమైన దాహంతో.

సుజాత యింటివైపు లాక్కుపోతున్నాయి కాళ్ళు.

అరే విచిత్రంగావుంది. నేను నడవడం లేదు- గాలిలో తేలిపోతున్నాను దూది పింజలా.

* * *

ఒళ్ళు కుదిపినట్లయి తెలివి వచ్చింది.

మంచంమీద వున్నాను.

గ్లాసుడు నీళ్ళు గడగడా త్రాగి స్థిమిత పడ్డాను.

ఎంత భయంకరమైన కల!

మనిషి తన అంతరాంతరాల్లో పశువులానే వుంటాడు. కోరికలు కూడా పాశవికమైనవే.

తరవాత మరి నిద్ర పట్టనేలేదు.

తల పగిలే ఆలోచనలు.

అందమైన నా చెల్లెలు సుశీలతోబాటు రాజారావుకి పదివేలు కట్నం కావాలి. అతని చెల్లెళ్ళకి లాంఛనాలు కావాలి. అతని తల్లికి వేదోక్తమైన పెండ్లి కావాలి. వెరసి నాకు పదిహేను వేల రూపాయిల ఖర్చు కావాలి.

నాన్నగారు నాకోసం మిగిల్చిన చిన్న కొబ్బరితోట అమ్మి, ప్రావిడెంటుఫండు మీద అప్పు తీసుకున్నాకే కట్నం డబ్బు ఇయ్యగలిగేను. మిగిలిన ఆడంబరాల కోసం మరో అయిదారు వేలు కావాలి.

ఎవర్నని అడిగేది?

సుజాతని అడిగితే- ఏమనుకుంటుంది? పోనీ అప్పుగానే! కట్నం వద్దంటూనే పరోక్షంగా అడుగుతున్నాననుకోదూ?

మరే త్రోవ కన్పించడంలేదు.

సుశీల పెళ్ళి నిరాటంకంగా జరగాలంటే సుజాతని ఎంతో కొంత సర్దుబాటు చెయ్యమనే అడగాలి.

ఇందులో తప్పేముంది- సర్దుబాటే కదా!

సుజాత ఇయ్యనంటే- అంటే-అంటే..

సుజాత అలా అనదు. ప్రేమపాశాలు బాగా బిగుసుకున్నాయి.

జీవితంతో లాటరీ ఆడదు, ఆడలేదు.

తూర్పు దిక్కు ఎర్రబారుతోంది.

మరి కొద్ది గంటల్లో- సుజాతకి చెప్పెయ్యాలి.

సమస్య తాత్కాలికంగా తీరింది.

అద్దంలో మొహం చూసుకున్నాను.

ఒళ్ళు జలదరించింది.

కోరలు లేకపోయినా వికృతంగా, రాత్రి కలలో కన్పించిన నా బావ రాజారావు మొహంలానే ఉంది.

— కన్నెపల్లి కామేశ్వరి